కథ

# జీవితాలతో చెలగాటం

‘‘ఇంకా నిద్రపోలేదా సతీష్? రాత్రి మూడున్నర వరకు కంటిన్యూగా చదవకూడదు. పది పదిన్నర వరకు చదువుకుని మళ్లీ తెల్లవారుజామున నాలుగ్గంటలకు లేచి చదువుకుంటే బావుంటుంది’’ అన్నది తల్లి ఆప్యాయంగా.

సతీష్ తల్లివంక తలెత్తి చూడకుండానే ‘‘ఎలాగోలా మంచి రాంక్ తెచ్చుకోవాలమ్మా. మనం వేలకి వేలు డబ్బుపోసి ప్రయివేట్ కాలేజీ పేమెంటు సీటు కొనుక్కోలేం కదా! ఫ్రీ సీటు సంపాదించుకోవాలి. అదీ మనక్కావాల్సిన బ్రాంచ్‌లో సంపాదించుకుంటేనే భవిష్యత్తు వుంటుంది. పైగా సెకండ్ ఛాన్స్. ఓ సంవత్సరం వ్యర్థమైపోయింది కదా!’’ అన్నాడు.

‘‘ఏమిటో నీ ధోరణి నీదే! ఎంతోమంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు ఉద్యోగాల్లేకుండా ప్రతి సంవత్సరం వేలాదిమంది తయారవుతున్నారు. నన్నడిగితే ఏ డిగ్రీయో పూర్తిచేసుకుని సివిల్ సర్వీసెస్‌కిగాని, గ్రూపు వన్ సర్వీసెస్‌కిగానీ ప్రిపేరవుతే చక్కటి ఉద్యోగావకాశాలుంటాయి. ఇంజనీరింగ్, మెడిసిన్ చదవడం ప్రెస్టేజియస్‌గా భావిస్తున్నారేతప్ప అంతకే మాత్రం తీసిపోని ప్రెస్టీజియస్ ఉద్యోగాలున్నాయని మరచిపోతున్నాం. నువ్వు ఎంసెట్ గురించి ఇంత శ్రమ పడడం దేనికి?’’ అన్నది తల్లి వనజ. ఆమె ఓ ప్రయివేట్ స్కూల్లో టీచర్‌గా పనిచేస్తోంది. సతీష్ తండ్రి రమణరావు ప్రభుత్వ శాఖలో సీనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్నాడు.

‘‘అమ్మా! నువ్వు చెప్పిన పరీక్షలక్కూడా గ్రాడ్యుయేషన్ చెయ్యాలికదా! ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్ చేసి ఏంబిఏ చేస్తే మంచి ఉద్యోగావకాశాలు ఉంటాయి. పోనీ నువ్వు చెప్పిన సివిల్ సర్వీసెస్‌కి ఇంజనీరింగ్ అయ్యాక కూడా ప్రిపేరు కావచ్చుకదా! కాకపోతే నాకు ఇంజనీరింగ్ కోర్సంటే ప్రాణమని నీకు తెలుసుకదమ్మా!’’ అన్నాడు సతీష్.

అతనికేది ఇష్టమో ఆ గ్రూపు తీసుకుంటేనే అందులో పూర్తి ఆసక్తి చూపించి నెగ్గుకొస్తాడని, తమ ఇష్టాయిష్టాల్ని కొడుకు మీద బలవంతంగా రుద్దితే శ్రద్ధాశక్తులు లేక దేంట్లోనూ పూర్తి స్థాయి మార్కులు తెచ్చుకోలేడని భార్యాభర్తలు నిర్ణయించుకుని అతని ఇష్టప్రకారమే ఎంపీసీలో చేర్పించారు.

సతీష్ రెండు సంవత్సరాలు కష్టపడి చదివి వెయ్యికి తొమ్మిదివందల నలభై రెండు మార్కులు తెచ్చుకున్నాడు. పేపర్లో అతని రాంక్ వేసి ఫోటో కూడా వేసారు. ఇంటర్ చదువుతూనే ఎంసెట్‌కి కోచింగ్ తీసుకున్నాడు. అది చాలదన్నట్లు పరీక్షకు ముందు షార్ట్‌టర్మ్ కోచింగ్ తీసుకున్నాడు. రాంకు మూడువేలమీద వచ్చింది. పేమెంటు సీటు. సివిల్ ఇంజనీరింగ్‌లో వచ్చింది-ఓ.సి.లో. సివిల్ అంటే అస్సలు ఇష్టంలేని బ్రాంచ్.

బాగా అప్‌సెట్ అయిన కొడుకును తల్లిదండ్రులు ఓదార్చారు.

‘‘బాబూ! నిన్నిప్పుడు డిగ్రీ కోర్సులో చేర్పిద్దామంటే అడ్మిషన్లు పూర్తయిపోయాయి. ఇంజనీరింగ్ సీటు రానివాళ్లు రెంటికీ చెడ్డ రేవడిలా అవుతున్నారు. అందుకే నేను బిఎస్సీకి అప్లయ్ చేద్దామనుకున్నాను. విన్నావు కాదు’’ అన్నాడు రమణారావు.

వనజ అడ్డొచ్చింది.

‘‘అసలే డిసప్పాయింట్ అయి డిప్రెషన్‌లో వున్నాడు. వాడ్ని మీ మాటలతో బాధపెట్టకండి. అసలు ఈ ఎంసెట్ పరీక్షను కండక్ట్ చేసినవాళ్లననాలి. లక్షల రూపాయలకు ఆశపడి పేపర్లు లీక్ చేసి విద్యార్థుల బంగారు భవిష్యత్తు మీద దెబ్బకొట్టారు. వీళ్ల స్వార్థానికి బాగా రాసిన విద్యార్థులు బలైపోయారు. ఆ పరీక్ష రద్దు చేసి మళ్లీ రెండునెలల తర్వాత రీ ఎగ్జామ్ పెట్టారు. పిల్లలకు మొదట్లో వున్న శ్రద్ధాసక్తులు సన్నగిల్లాయి. రెండోసారి పరీక్షకు ప్రిపేర్ కావడానికి కేవలం పదిహేనురోజుల వ్యవధి మాత్రమే దొరికింది. ఈ కాస్త వ్యవధిలో వాళ్లు మెంటల్‌గా ప్రిపేర్ కావాలి. మళ్లీ పరీక్షలు రాయాలి. ఎంత కష్టం. ఇవన్నీ ఈ ఎంసెట్ నిర్వాహకులకు తెలియదా? విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవడమేనా వీళ్ల పని?’’ ఆవేదగా అన్నది వనజ.

‘‘మొదటిసారి చాలా బాగా రాశానమ్మా. ఖచ్చితంగా అయిదు వందల లోపు రేంకు వస్తుందని ఆశించాను. ఇంతలో పేపరు లీకు అయిందనే కారణంతో రీ ఎగ్జామ్ పెట్టినందువల్లే నాకు మూడువేల మీద వచ్చింది ర్యాంక్. నాకైతే కంప్యూటర్ ఇంజనీరింగ్ అంటే ఇష్టం. అది కాకపోతే కెమికల్. అది కూడా రాకపోతే మెకానికల్. ఇక మరే బ్రాంచ్ అయినా నాకిష్టంలేదు. చివరకు ఎవరికీ అక్కర్లేని సివిల్ వచ్చింది’’ కళ్లనీళ్ల పర్యంతంగా అన్నాడు సతీష్.

‘‘పోనీలే. ఈసారి లాంగ్‌టర్మ్ కోచింగ్ ఇప్పిస్తాను. తప్పకుండా ఈసారి వందలోపు రాంక్ వస్తుంది. రెండోసారి పరీక్ష రాసినవాళ్లకి మంచి రాంక్ రావడం నాకు తెలుసు. రేపే చేర్పిస్తాను. రెడీగా వుండు’’ అన్నారు రమణారావు.

వనజకైతే అనవసరంగా అమూల్యమైన ఒక విద్యాసంవత్సరం కొడుకు నష్టపోయాడనే బాధ సుళ్ళు తిరుగుతోంది. పైగా ఈ ఎంసెట్ పరీక్ష కొడుకు ఆత్మవిశ్వాసాన్ని దెబ్బ తీసిందేమోననే బాధ ఆమె మనసులో తొలుస్తోంది.

సతీష్ లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకోవడం, మళ్లీ ఎంసెట్ పరీక్ష రాయడం అంతా చాలా వేగంగా జరిగిపోయాయి.

‘‘ఎలా రాశావు నాన్నా?’’ కొడుకు పరీక్ష రాసి రాగానే అడిగింది వనజ.

‘‘చాలా బాగా ఆన్సర్ చేశానమ్మా. నా ఎక్స్‌పెక్టేషన్ మొదటి వందలోనే వస్తుంది రాంక్. ఇంటికొచ్చేముందు మా ఇన్‌స్టిట్యూట్ సార్‌ని కలిసి వచ్చాను. నేను చేసిన పేపరుకి ఆయన పర్సంటేజి కట్టారు. తొంభై అయిదు శాతం పైమాటేగాని తక్కువుండదు’’ సంతోషంగా చెప్పాడు సతీష్.

రమణారావు విషయం తెలిసి చాలా సంతోషించాడు.

‘‘చాలా కష్టపడి చదివావు. రాత్రింబవళ్లు ఏకధాటిగా కృషి చేశావు. నీకు చాలా మంచి రాంక్ వస్తుంది. నువ్వు కోరుకున్న బ్రాంచిలో సీటు గ్యారంటీ’’ అన్నారు.

వనజ సంతోషంగా అంది ‘‘ఈ సంవత్సరం కొత్తగా తొమ్మిది ఇంజనీరింగ్ కాలేజీలకు అనుమతి లభించడం, మరో పది కాలేజీలు పరిశీలనలో వుండడం పేపర్లో చదివాం కదా! ఈసారి నువ్వు కోరుకున్న బ్రాంచి తప్పకుండా వస్తుంది బాబూ!’’

రిజల్టు కోసం ఎదురుచూపులు మొదలయ్యాయి. సతీష్ మరీ టెన్షన్‌గా వుండడం గమనించిన తల్లిదండ్రులు మరీ అంత ఉత్కంఠతో ఎదురు చూడనక్కర్లేదని, తప్పకుండా మంచి రాంక్ వస్తుందని ఎంతగా చెప్పినా సహజంగానే క్యూరియాసిటీ పెరుగుతూ వచ్చింది సతీష్‌లో.

దానికి తగ్గట్టే అనుకున్న సమయానికి సాంకేతిక కారణాల వల్ల ఫలితాలు వెలువరించలేకపోతున్నందుకు విచారాన్ని ప్రకటించారు ఎంసెట్ కన్వీనర్లు. కంప్యూటర్స్ మొరాయించడం, రిజర్వేషన్ రోస్టరు ప్రకారం సీట్లు కేటాయించడంతో జాప్యం జరిగినందువల్ల మరో నాలుగురోజులు ఫలితాలు వాయిదాపడ్డాయి.

చివరికి నాలుగురోజుల తర్వాత ఉదయం పదకొండు గంటలకు ఉన్నత విద్యాశాఖామాత్యులు రిజల్టు విడుదల చేయడం, మధ్యాహ్నాం మూడుగంటలకు పేపర్లో ప్రచురింపబడడం జరిగింది.

ఆ రోజు రమణారావు సెలవుపెట్టి ఇంట్లోనే సతీష్‌కి తోడుగా వున్నారు. సతీష్ నెంబర్ వెతుక్కోవడానికి వారిద్దరు సాయపడ్డారు. నెంబరు చూసుకుంటూనే అప్‌సెట్ అయిపోయాడు సతీష్.

రమణారావు కూడా ఆ రాంక్ చూసి అవాక్కయ్యాడు. వనజ నెత్తిన పిడుగు పడ్డట్టు అదిరిపడింది.

సతీష్ దుఃఖాన్ని అదుపు చేసుకోలేక గోలగా ఏడ్చేసాడు.


పదివేల మూడువందల ఆరు రాంక్ వచ్చింది.

కొడుకును ఓదార్చడం వారికి గగనమైపోయింది. గత సంవత్సరం మూడువేల మీద వస్తేనే సివిల్ పేమెంట్ సీటు వచ్చింది. ఇప్పటి పరిస్థితి ఊహించడానికే భయం వేసింది వాళ్లిద్దరికి.

రవుణరావు కొడుకును కంట్రోల్ చేయడానికి చాలా అవస్థపడ్డారు.

''నాన్నగారూ! నాకు ఖచ్చితంగా వందల్లోనే వస్తుంది రాంక్. నేను చాలా బాగా. చేశాను. అమ్మా! నాకు చాలా అన్యాయం జరిగింది'' గోలుగోలున ఏడుస్తున్న ఎదిగిన కొడుకును ఏం చెప్పి ఏమార్చగలరు తల్లిదండ్రులు?

''బాబూ సతీష్! ఏడవకు. నేను రీ కౌటింగ్‌కి అప్లయ్ చేస్తాను. లేదా హైదరాబాద్ వెళ్లి వస్తాను. నువ్వు నిరాశ పడవలసిన అవసరంలేదు'' అంటూ ఎంతగానో అనునయించాడు రమణారావు.



ఆ రోజు రాత్రి ఎవరు భోజనాలు చేయలేదు ఆ ఇంట్లో.

మర్నాటి పేపర్లో ఎంసెట్ రిజల్టు విషయంలో కొన్ని అవకతవకలు జరిగినట్లు వచ్చింది. అది చూసి సతీష్ తల్లిదండ్రులకు కాస్త ఊరట కలిగింది.

''నీ రాంక్ విషయంలో ఖచ్చితంగా కంప్యూటర్ ప్రాబ్లమ్ వచ్చి వుంటుంది. ఒకటి రెండురోజుల్లో మళ్లీ కరెక్ట్ రాంక్‌లు రావచ్చు'' అంటూ కొడుకును సముదాయించాడు రమణారావు. సతీష్‌లో మళ్లీ ఆశలు చిగురించాయి.

మరో నాలుగు రోజులకు మరో వార్త వచ్చింది. ఎవరో విద్యార్థిని రాంక్ మంచిది రాలేదని, తనకు అన్యాయం జరిగిందని, రిజల్టును సవాలు చేస్తూ కోర్టుకు వెళ్లడం, తొమ్మిదివేల మీద వున్న ఆమె రాంక్ రెండువేలలోపు వచ్చినట్టు ఎంసెట్ కన్వీనరు ప్రకటించడం జరిగింది.

దాంతో పెద్ద రాంక్ వచ్చినవాళ్లందరూ రీ కౌటింగ్ కొరకు ప్రభుత్వం విధించిన రుసుము అయిదువందల రూపాయలు డ్రాఫ్టుతో దరఖాస్తు చేసుకోవడం, మరికొందరు కోర్టుకు వెళ్లడం జరిగింది.

రమణారావు వెంటనే డ్రాఫ్టుతో దరఖాస్తు పంపాడు.

మళ్లీ ఆశ ఉత్కంఠల ఎదురుచూపులు మొదలయ్యాయి.

నాలుగురోజులు గడిచాయి. సతీష్ దరఖాస్తుకు ఎలాంటి సమాధానం రాలేదు.


ఆ రోజు తల్లితో చెప్పాడు సతీష్ ''మా ఫ్రెండ్స్ అందరకు రాంక్ కార్డులు వచ్చేశాయి. నాకే ఇంకా రాలేదు.''

**బొమ్మిడి అచ్చారావు**

నాలుగురోజులు గడిచినా రివైజ్డ్ రాంక్‌గానీ, కన్వీనర్ నుంచి ఎలాంటి సమాధానంగానీ అందలేదు.

''నా ఫ్రెండ్స్ కొందరికి కాల్ లెటర్స్ కూడా వస్తున్నాయి. నాకు రివైజ్డ్ రాంక్ కూడా ఇంకా తెలలేదు. రాంక్ కార్డు కూడా రాలేదు'' అంటూ తల్లితో చెప్పుకుని మదనపడ్డాడు.

ప్రతిరోజూ పోస్టు కోసం ఎదురు చూడలేక సరాసరి పోస్టాఫీసుకే వెళ్లిపోతున్నాడు. అతని టెన్షన్ చూసి తల్లి దండ్రులకి కళ్లనీళ్ల పర్యంతమయింది.




ఈలోపల రమణారావు కన్వీనర్‌కి రిజిష్టరు లెటర్ రాశాడు. టెలిగ్రాం కూడా ఇచ్చాడు. రెండుసార్లు ఫోన్ కూడా చేశాడు. అయితే అట్నుంచి ఆశించిన సమాధానమేదీ రాలేదు.

కౌన్సిలింగ్ ప్రారంభం కావడానికి వ్యవధి రెండురోజుల్లోకి వచ్చేసింది.

''నేనీరోజే హైదరాబాద్ వెళ్లి అన్ని విషయాలూ కనుక్కుంటాను. నీ హాల్ టిక్కెట్ ఇవ్వు'' అన్నాడు రమణారావు. సతీష్ హాల్ టిక్కెట్ తండ్రి చేతిలో పెట్టాడు. కొడుకు ఈ వారం రోజుల్లో ఎంతగా బక్కచిక్కిపోయాడో, ఎంత ఆవేదనను, గుండె కోతను అనుభవిస్తున్నాడో చూసి చలించిపోయాడు రమణారావు. కొడుకును సాదరంగా ఆలింగనం చేసుకుని ''మంచి వార్తతో వస్తాను'' అన్నాడు.

రమణారావు హైదరాబాద్‌లో ట్రెయిన్ దిగుతూనే ఉస్మానియా యూనివర్శిటీకి పరుగెత్తాడు. తాపీగా పదిన్నర గంటలకు ఆఫీసు తెరిచాక చావు కబురు చల్లగా చెప్పారు వాళ్లు-మాసాబ్ టాంక్‌వద్ద వున్న పాలిటెక్నిక్‌లో కౌన్సిలింగ్ ప్రారంభమవుతోంది కాబట్టి ఎంసెట్‌కి సంబంధించిన అన్ని వివరాలూ అక్కడే చెబుతారు వెళ్లమని!

అదే వేగంతో ఆటోలో మాసాబ్ టాంక్ వద్ద ఎంసెట్ కౌన్సిలింగ్ జరుగుతున్న పాలిటెక్నిక్‌కి పరుగెత్తాడు రమణారావు.

''సారీ! కౌన్సిలింగ్ సమయంలో రాంక్ చెప్పడం వీలు కాదండి. అయినా మీ అబ్బాయికి రాంక్ వస్తే కాల్ లెటర్ వస్తుందికదా! రాంక్ కార్డు ఒక్కోసారి పోస్టులో మిస్ కావచ్చు. దానికి మేము బాధ్యులం కాదుకదా. పేపర్లో వచ్చిన రాంక్ కరెక్టే అయి వుంటుంది. మా టైం చాలా విలువైనది. దయచేసి వెళ్లిపొండి'' కసురుకున్నట్లే చెప్పారు ఆ ఉద్యోగి.

రమణారావుకి తల గిర్రున తిరిగింది. హతాశుడైపోయాడు. తనేదో చల్లని కబురు తెస్తానని ఇంటిదగ్గర వెయ్యి కళ్లతో ఆత్రుతగా ఎదురుచూసే కొడుకు ముఖం కళ్లముందు కన్పించింది. ఈ విషయం తెలిస్తే కొడుకు ఏమైపోతాడో? కాల్ లెటర్ పంపిస్తానని చెప్పారని కొడుకును మభ్యపెట్టాలనే నిర్ణయానికి వచ్చి తిరుగుముఖం పట్టాడు రమణారావు.

ఇంట్లో కాలు పెడుతూనే గోలుగోలున ఏడుస్తూ వచ్చి అతనిమీద వాలిపోయింది వనజ.

''ఏమిటి, ఏమయింది?'' అంటూ కంగారుగా అరిచాడు రమణారావు.

అతని చేతికి రెండు కాగితాలు అందించింది వనజ.

మొదటిది కన్వీనర్ నుంచి ప్రింటెడ్ లెటర్. దాంట్లో అందరికీ కామన్‌గా రాసిన లెటర్ వుంది. 'రాంక్‌లో ఎలాంటి మార్పులేదు. గతంలో ఇచ్చిన రాంక్ సరైనదే' అని. అయితే గతంలో ఏ రాంక్ ఇచ్చినదీ అందులో లేదు.

''ఈ లెటర్ నిన్న పోస్టులో వచ్చింది. వీడు పోస్టాఫీసు నుంచే సరాసరి అందుకుని వుంటాడు దీన్ని. నాకీ లెటర్ సంగతి చెప్పలేదు. రాత్రంతా నిద్రపోకుండా పక్కమీద దొర్లుతూనే వున్నాడు. తెల్లవారేసరికి మీరు హైదరాబాద్ నుంచి వస్తారుకదా అని ఎదురు చూస్తున్నాను. ఈలోపల ఈ చీటీ పెట్టి...సతీష్'' దుఃఖంతో ఆమె గొంతు పూడుకుపోయింది.

రెండో వాక్యంలో రెండే వాక్యాలున్నాయి.

''ఈసారి నాకు మంచి రాంక్, మంచి బ్రాంచ్ వస్తాయని ఆశలు పెట్టుకున్నాను. నా జీవితం వ్యర్థమైపోయింది. నా స్నేహితుల ముందు తలెత్తుకోలేను. నా జీవితాన్ని అంతం చేసుకుంటాను-సతీష్''

అప్పటికే ఇరుగు పొరుగు చేరిపోయారు.

''సతీష్! ఎంత పని చేశావు నాయనా...'' అంటూ మొదలు నరికిన చెట్టులా కూలిపోయాడు రమణారావు.

''మీరలా నిరాశ పడకండి. పోలీసు రిపోర్టివ్వండి. అంతటా వెతుకుదాం పదండి'' అంటున్నారు చుట్టుపక్కలవాళ్లు.

రమణారావు ముందుగా పోలీస్ స్టేషన్‌లో రిపోర్టిచ్చాడు.

ఎస్.ఐ వెంటనే రియాక్టయ్యాడు.

''మీరు నాతో రండి'' అన్నాడతను రమణారావుతో.

''వనజా! నువ్వింటికి వెళ్లు. మేమంతా వెతుకుతాం కదా! బాబుకి ఏం కాదు'' అన్నాడు రమణారావు. వనజ ఒక్క అడుగు కూడా కదల్లేదు. ''బాబులేని ఇంటికి వెళ్లలేను'' అన్నది.

ఎస్.ఐ రమణారావును రైల్వేస్టేషన్ దగ్గరకు తీసుకు వెళ్లాడు. అక్కడ జనం గుంపులు గుంపులుగా ఉన్నారు.

ఎస్.ఐ చల్లగా చెప్పాడు ''ఎవరో అబ్బాయి ట్రెయిన్ కింద తల పెట్టేశాడు. ఎందుకైనా మంచిదని ఓసారి చూపిద్దామని...''

రమణారావు ఒక్క పరుగున గుంపును చీల్చుకుని వెళ్లాడు.




అక్కడ తల, మొండం వేర్వేరుగా పడివున్న బీభత్స దృశ్యం!

రమణారావు శవాన్ని గుర్తుపట్టాడు.

''బాబూ సతీష్!'' అంటూ పెద్దగా అరచి కుప్పకూలిపోయాడు.

ఆ రోజు పోస్టులో సతీష్ పేర రెండు కవర్లు వచ్చాయి.

ఒకటి రాంక్ కార్డు-నూట ముప్పై ఆరు రాంక్‌లో. రెండోది-మర్నాడు కౌన్సిలింగ్‌కి రమ్మంటూ కాల్ లెటర్. ★